ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 46 | శుక్రవారం 17, అక్టోబర్ 2025 | పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com




## స్వర్ణాంధ్రతోనే
# వికసిత్ భారత్
## గూగుల్ రాకతో ప్రపంచం చూపు ఏపీ వైపు

**ఆత్మనిర్భర్ భారత్ కు సరికొత్త శక్తిగా ఏపీ**
**చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి**
**నారా లోకేష్ సారధ్యంలో పండుగలా జీఎస్టీ సంస్కరణల ప్రచారం**
**కర్నూలులో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ**
**ఏపీలో రూ.13,429 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన ప్రధాని**

**ఏపీ బ్యూరో, ప్రజాస్వరం :**
వికసిత్ ఏపీతోనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారం అవుతుందని ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే జీఎస్టీ సంస్కరణలకు సార్థకత చేకూరుతుందని స్పష్టం చేశారు. వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ వంటివి సాకారం కావడంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని స్పష్టం చేశారు. ఏపీ యువత ఎంతో చైతన్య కలిగిన వారని... సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వంటి వారి నేతృత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో వెళ్తోందని... కేంద్రం కూడా పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సహకరిస్తుందని ప్రధాని చెప్పారు. సూపర్ జీఎస్టీసూపర్ సేవింగ్స్ బహిరంగ సభ గురువారం నన్నూరు చెక్ పోస్ట్ సమీపంలో జరిగింది. శ్రీశైలంలో మల్లిఖార్జున స్వామి వారిని, భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అనంతరం ప్రధాని కర్నూలు చేరుకున్నారు. కర్నూలులో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ జీఎస్టీ బచత్ ఉత్సవ్ పై ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదికకు చేరుకున్న ప్రధానికి మంత్రులు, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజా ప్రతినిధులు ..మిగతా 2లో

## సుప్రీంకోర్టులో
# చుక్కెదురు




**రిజర్వేషన్లపై స్పెషల్ లీవ్ పిటిషన్ నిరాకరణ**
**బీసీ రిజర్వేషన్ల అమలుకు సర్కారు ప్రయత్నాలు విఫలం**
**హైకోర్టులోనే తేల్చుకోవాలన్న సుప్రీంకోర్టు**
**రిజర్వేషన్లపై ఉన్న ఆశలన్నీ ఆవిరి అయినట్టేనా?**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 9పై హైకోర్టు విధించిన స్టేను సవాల్ చేస్తూ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ)పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున, తమకు సంబంధం లేకుండా మెరిట్స్ ప్రకారం విచారణ చేపట్టాలని అత్యున్నత న్యాయస్థానం హైకోర్టుకు సూచించింది. అవసరమైతే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలు నిర్వహించుకోవచ్చని కూడా స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో తెలంగాణ ప్రభుత్వానికి మరో ఎదురుదెబ్బ తగిలింది. బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి రాష్ట్ర సర్కారు చేస్తున్న ప్రయత్నాలకు ..మిగతా 2లో



## నవంబర్ 14న కోర్టుకు రండి..

**హోటల్ కూల్చివేత కేసులో దగ్గుబాటి ఫ్యామిలీకి చిక్కులు**
**వెంకటేశ్, రానా, సురేశ్ బాబు, అభిరామ్‌పై కేసు నమోదు**
**నవంబర్ 14న వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం**
**పర్సనల్ బాండ్ సమర్పించాలని సూచించిన నాంపల్లి కోర్టు**
**కోర్టు ఆదేశాలను ధిక్కరించారన్న ఆరోపణలపై విచారణ**

03

## బోగస్ ఓట్లపై జోక్యం చేసుకోలేం..

**జూబ్లీహిల్స్ బోగస్ ఓట్లపై హైకోర్టులో ముగిసిన విచారణ**
**లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలు చేసిన కేటీఆర్, మాగంటి సునీత**
**చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం సమాధానం**




03

## నిన్న మల్లోజుల, నేడు ఆశన్న..

**అడవి బాట వీడి జనజీవన స్రవంతిలోకి మావోయిస్టులు!**
**భద్రతా దళాల నిరంతర ఎన్‌కౌంటర్‌లు**
**అడవి నుంచి జనం బాట పడుతున్న మావోయిస్టులు**

03





## సీఎం, మాకు ఎలాంటి
# విభేదాలు లేవు..


**మాజీ ఓఎస్డీ సుమంత్ విషయం నాకేమీ తెలియదు**
**రేవంతన్న సీఎం కావాలని నేను, సురేఖ ఎంతో కష్టపడ్డాము**
**మీనాక్షి అమ్మ చెప్పినట్లు వింటా**

02

## భూగర్భంలోకి
# విద్యుత్ లైన్లు!

**గ్రేటర్ హైదరాబాద్‌లో ఓవర్‌హెడ్ విద్యుత్ తీగల తొలగింపునకు ప్రణాళిక**
**బెంగళూరు మాదిరిగా భూగర్భ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయం**
**మొత్తం 25,000 కిలో మీటర్ల లైన్ల మార్పునకు ప్రతిపాదనలు సిద్ధం**
**సుమారు రూ.15 వేల కోట్లు ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా**
**పనుల కోసం రోడ్లు తవ్వకుండానే ఆధునిక టెక్నాలజీ వినియోగం**
**మూడు జోన్లకు సంబంధించిన డీపీఆర్‌లను సిద్ధం చేసిన విద్యుత్ సంస్థ**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**
గ్రేటర్ హైదరాబాద్ వాసులకు త్వరలో వేలాడే విద్యుత్ తీగల సమస్య తీరనుంది. నగరమంతటా సురక్షితమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం భూగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు దక్షిణ తెలంగాణ ..మిగతా 2లో



## మోదీకి ట్రంప్ అంటే భయం..
## అందుకే రష్యా ఆయిల్‌పై మౌనం

**రష్యా నుంచి చమురు కొనబోమని మోదీ హామీ ఇచ్చారన్న ట్రంప్**
**మోదీకి ట్రంప్ భయం పట్టుకుందంటూ రాహుల్ ఎద్దేవా**
**సెప్టెంబర్‌లోనూ రష్యా నుంచే భారత్ అధికంగా చమురు దిగుమతి**
**ట్రంప్ ప్రకటనపై ఇంకా స్పందించని కేంద్ర ప్రభుత్వం**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీకి ట్రంప్ అంటే భయం పట్టుకుందని ఆయన ఎద్దేవా చేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు నిలిపివేస్తుందని ట్రంప్ చేసిన ప్రకటనపై కేంద్ర ప్రభుత్వం ఇంకా స్పందించక ముందే రాహుల్ ఈ విమర్శలు చేయడం గమనార్హం. ప్రధాని నరేంద్ర మోదీని 'గొప్ప వ్యక్తి' అని, భారత్‌ను 'అద్భుతమైన దేశం' అని పొగిడిన ట్రంప్, అదే ..మిగతా 3లో





# సుప్రీంకోర్టులోనూ చుక్కెదురు

మొదటిపేజీ తరువాయి

ఇది తాత్కాలిక అడ్డంకిగా మారింది. సుప్రీంకోర్టు జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ సుధాన్షు ధూలియాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. పిటిషన్‌ను తీసుకోవడానికి అంగీకరించకపోవడంతో, ఇక హైకోర్టులోనే ఈ అంశం పరిష్కారమవ్వాల్సి ఉంది.

**నేపథ్యం ఏమిటి?**


తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగాల్సి ఉండగా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ 9 జారీ చేసింది. అయితే, ఈ జీఓపై హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 9న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి, జీఓ అమలును స్టే చేసింది. దీనిని సవాల్ చేస్తూ రాష్ట్ర సర్కారు 13వ తేదీన సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేసింది. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా, 16 లేదా 17వ తేదీల్లో ఏదో ఒకరోజు విచారణ చేపట్టాలని మంగళవారం సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ ముందు మెన్షన్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగానే, రిజిస్ట్రీ ఈ కేసును నేటి విచారణ జాబితాలో చేర్చింది. అయితే, సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణకు అంగీకరించకుండా, హైకోర్టులోనే పరిష్కరించుకోవాలని సూచించింది.

**సుప్రీంకోర్టు సూచనలు**

"ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. మా ఆదేశాలతో సంబంధం లేకుండా, మెరిట్స్ ప్రకారం విచారణ చేపట్టండి" అని సుప్రీంకోర్టు హైకోర్టుకు స్పష్టం చేసింది. అంతేకాకుండా, "కావాలనుకుంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చు" అని పేర్కొంది. దీంతో, రాష్ట్ర ప్రభుత్వం ఇక పాత పద్ధతిని అనుసరించి ఎన్నికలు నిర్వహించాలా లేదా హైకోర్టు నిర్ణయాన్ని ఎదురుచూడాలా అనే ధర్మసంకటంలో పడింది. ఈ నిర్ణయం బీసీ రిజర్వేషన్ల అమలుపై ప్రభావం చూపనుంది. తెలంగాణలో బీసీల సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఇది తాత్కాలిక అడ్డంకిగా మారినప్పటికీ, హైకోర్టు విచారణలో సానుకూల ఫలితం రావచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరిన్ని వివరాల కోసం హైకోర్టు తదుపరి విచారణను ఎదురుచూడాల్సి ఉంది.

# భూగర్భంలోకి విద్యుత్ లైన్లు!

మొదటిపేజీ తరువాయి



విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. బెంగళూరు నగరంలో విజయవంతంగా అమలు చేస్తున్న ఈ విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని, హైదరాబాద్‌లోనూ దీనిని అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు కింద గ్రేటర్ పరిధిలోని సుమారు 25,000 కిలోమీటర్ల పొడవైన ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లను దశలవారీగా భూగర్భంలోకి మార్చనున్నారు. ఇందులో 21,643 కిలోమీటర్ల 11 కేవీ లైన్లు, 3,725 కిలోమీటర్ల 33 కేవీ లైన్లు ఉన్నాయి. ఈ బృహత్కార్యానికి దాదాపు రూ.14,000 కోట్ల నుంచి రూ.15,000 కోట్ల వరకు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిస్కం అధికారులు ఇప్పటికే మూడు జోన్లకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్) సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు. ఈ పనులను వేగంగా, ప్రజలకు ఇబ్బంది లేకుండా పూర్తి చేయడానికి 'హారిజాంటల్ డ్రిల్లింగ్' అనే సరికొత్త టెక్నాలజీని ఉపయోగించాలని డిస్కం భావిస్తోంది. ఈ విధానంలో రోడ్లను పెద్దగా తవ్వాల్సిన అవసరం లేకుండానే, ప్రత్యేక యంత్రాలతో భూమిలో 23 మీటర్ల లోతులో కేబుళ్లను వేయవచ్చు. తద్వారా పనులు వేగంగా పూర్తవడంతో పాటు ఖర్చు కూడా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. భూగర్భ కేబుళ్లు వేయడం కష్టంగా ఉన్న ప్రాంతాల్లో 'ఎయిర్ బంచుడ్' (ఏబీ) కేబుళ్లను ప్రత్యామ్నాయంగా పరిశీలిస్తున్నారు.

ఈ ప్రాజెక్టు అమలుకు ముందు డిస్కం ఉన్నతాధికారులు, ఇంజనీర్లు బెంగళూరు, ముంబై, కోల్‌కతా వంటి నగరాల్లో పర్యటించి అక్కడి భూగర్భ కేబుల్ వ్యవస్థను అధ్యయనం చేశారు. బెంగళూరులో మాదిరిగా, భూగర్భంలో కేబుళ్ల కోసం ఏర్పాటు చేసే డక్టులను భవిష్యత్తులో టెలికాం సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా ఆదాయం సంపాదించే ఆలోచనను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్' (ఆర్డీఎస్ఎస్) కింద నిధులు పొందే అవకాశాలను కూడా డిస్కం అన్వేషిస్తోంది.

# రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :



రాష్ట్రంలోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చాకనే ఎన్నికలకు పోవాలని.. చట్టపరంగా షెడ్యూల్ 9లో చేర్చి రిజర్వేషన్లు సాధించాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ బీసీ నేతలు సమావేశం అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే తీవ్ర పరిమాణాలు ఉంటాయని హెచ్చరించారు. కాంగ్రెస్ డ్రామా చేయడానికి చూసిందని.. తాము అసెంబ్లీలోనే చెప్పామని అన్నారు. కులగణన సరిగా జరగలేదని.. కులగణన సర్వే పత్రంపై సీఎం, డిప్యూటీ సీఎం ఫొటో పెట్టడం తప్పు అని తెలిపారు. గవర్నర్‌కు తీర్మానం వెళ్లక ముందే ఢిల్లీలో ధర్నా చేశారని.. ఆ ధర్నాకు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ రాలేదన్నారు. ఢిల్లీకి వెళ్లి ఎంజాయ్ చేసి వచ్చారని ఆరోపించారు. పార్టీల పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు పోతామంటే కుదరదని.. తాము ఒప్పుకునేదే లేదని స్పష్టం చేశారు. 18న తెలంగాణ భవన్ నుంచే వెళ్లి బీసీ బంద్‌లో పాల్గొంటామని తెలిపారు. అందరూ బంద్‌కు సహకరించాలని.. రాష్ట్రవ్యాప్తంగా బీసీలు బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు వారి వెంట పడుతూనే ఉంటామన్నారు. ఢిల్లీలో జరిగిన ధర్నాకు రాహుల్ ఎందుకు రాలేదో కాంగ్రెస్ వాళ్లు చెప్పాలని డిమాండ్ చేశారు

# స్వర్ణాంధ్రతోనే వికసిత్ భారత్

మొదటిపేజీ తరువాయి



స్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ వేదికపైకి చేరుకున్నారు. ఓపెన్ టాప్ జీపులో ర్యాలీగా వచ్చిన ముగ్గురు నేతలకు భారత్ మాతాకీ జై అంటూ మువ్వెన్నల జెండాలతో ప్రజలు స్వాగతం పలికారు. బహిరంగ సభలో జీఎస్టీ సంస్కరణలపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ..."ఆంధ్రప్రదేశ్ శాస్త్రసాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం, యువత ఎంతో చైతన్యవంతులు. ఏపీలో విజన్ ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లాంటి నేతలు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉంది. గత 16 నెలల్లో డబుల్ ఇంజన్ సర్కారు వల్ల ఏపీలో ప్రగతి వేగంగా జరుగుతోంది. ఢిల్లీ, అమరావతిలు రెండూ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు వెళ్తున్నాయి. దేశ ఆర్థిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ఓ కీలక ప్రాంతంగా ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి దిశగా నడుస్తోంది. భారత్ దేశంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రగతి వేగాన్ని ప్రపంచం గమనిస్తోంది. గూగుల్ లాంటి ఐటీ దిగ్గజం ఏపీలో అతిపెద్ద పెట్టుబడిని ప్రకటించింది. దేశపు తొలి అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రం విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అమెరికా వెలుపల భారీ పెట్టుబడితో ఏపీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ పెడుతున్నట్టు గూగుల్ సీఈఓ నాతో చెప్పారు. డేటా సెంటర్, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్ లాంటి అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఈ కేంద్రంలో ఏర్పాటు కాబోతున్నాయి. ప్రపంచ దేశాలను కలుపుతూ వేయనున్న సబ్ సీ కేబుల్ ద్వారా తూర్పు తీరం బలోపేతం అవుతుంది. విశాఖలో ఏర్పాటు కానున్న కనెక్టివిటీ హబ్ భారత్ కే కాదు ప్రపంచానికి సేవలందిస్తుంది. ఈ విషయంలో సీఎం చంద్రబాబు విజన్ ను అభినందిస్తున్నాను. 21వ శతాబ్దపు మాన్యుఫాక్చరింగ్ కేంద్రంగా ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భారత్ ఉత్పత్తి కేంద్రంగా రూపు దిద్దుకుంటోంది. ఆత్మనిర్భర్ భారత్ లో ఏపీ కీలకంగా మారింది." అని ప్రధాని అన్నారు.

**ఆంధ్ర ప్రదేశ్ ప్రగతిని కాంగ్రెస్ నాశనం చేసింది**

"కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ ప్రగతిని నాశనం చేశాయి. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ఏపీ ప్రగతి ద్వారాలు తెరుచుకుని వేగంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. దేశ ప్రగతికి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చాలా కీలకం. రాయలసీమ అభివృద్ధితోనే ఏపీ అభివృద్ధి ఉంది. కర్నూలులో ప్రారంభించిన ప్రాజెక్టులు రాయలసీమ ప్రాంత ప్రగతికి సరికొత్త ద్వారాలు తెరుస్తాయి. పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరుగుతుంది. ఏపీ వేగవంతమైన అభివృద్ధి కోసం కొప్పర్తి ఒర్వకల్ పారిశ్రామిక నోడ్ల ద్వారా వచ్చే పెట్టుబడులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రాయలసీమలోని ప్రతి జిల్లాలోనూ ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి. ఆత్మనిర్భర్ భారత్ కు సరికొత్త శక్తిగా ఏపీ తయారవుతోంది. కృష్ణా జిల్లా నిమ్మకూరులో రక్షణ రంగానికి చెందిన నైట్ విజన్ గాగుల్స్, క్షిపణుల సెన్సార్లు, డ్రోన్ గార్డులను తయారు చేసే సంస్థ ఏర్పాటు కావడం ముదావహం. రక్షణ రంగ ఉత్పత్తుల ఎగుమతులు కూడా చేసేందుకు ఆస్కారం ఇస్తుంది. ఆపరేషన్ సింధూర్ లో దేశంలో తయారైన ఉత్పత్తుల బలం ఏమిటో చూశాం. కర్నూలును భారత్ డ్రోన్ హబ్ తయారు చేయాలని ఏపీ నిర్ణయించటం సంతోషం. ఆపరేషన్ సింధూర్ ద్వారా డ్రోన్ల పనితీరు ఏమిటో తెలియచెప్పింది. డ్రోన్ల తయారీ ద్వారా కర్నూలు భారత్ కు ఓ గర్వ కారణంగా నిలుస్తుంది." అని ప్రధాన మంత్రి చెప్పారు.

**ప్రారంభించిన ప్రాజెక్టులు ప్రగతికి మార్గాలు**

"ఈ ప్రాజెక్టులన్నీ రాష్ట్రంలో కనెక్టివిటి బలోపేతం కావటంతో పాటు పరిశ్రమలను బలోపేతం చేస్తాయి. ఈ ప్రాజెక్టులతో కర్నూలుతో పాటు పరిసర ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుంది. దేశానికైనా, రాష్ట్రానికైనా ఇంధన భద్రత అవసరం. ప్రస్తుతం 3 వేల కోట్ల విలువైన ట్రాన్స్ మిషన్ ప్రాజెక్టులను ప్రారంభించాం. తద్వారా దేశ ఇంధన సామర్థ్యం పెరుగుతుంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బ్లాక్ అవుట్ లాంటి విద్యుత్ సంక్షోభాలు వచ్చాయి. తలసరి విద్యుత్ వినియోగం 1000 యూనిట్ల కంటే తక్కువే ఉంది. చాలా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూడా లేని పరిస్థితి. ఇప్పుడు క్లీన్ ఎనర్జీ నుంచి మన అవసరాలకు తగినంత ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తున్నాం. 1400 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగం ఇప్పుడు దేశంలో ఉంది. తగినంత విద్యుత్ దేశ ప్రజలకు లభ్యం అవుతోంది. శ్రీకాకుళం నుంచి ఆంగుల్ వరకూ గ్యాస్ పైప్ లైన్ ను జాతికి అంకితం చేశాం. 20 వేల సిలెండర్ల సామర్థ్యంతో ఇండేన్ బాటిలింగ్ ప్లాంట్ ను చిత్తూరులో ప్రారంభించాం. మల్టీమోడల్ ఇన్ఫ్రా ప్రాజెక్టులతో కనెక్టివిటీ పెంచుతున్నాం. సబ్బవరం నుంచి షీలా నగర్ వరకూ కొత్త హైవేతో కనెక్టివిటీ పెరిగింది. రైల్వే రంగంలో కొత్త యుగం ప్రారంభమైంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందేలా ప్రాజెక్టులను ప్రారంభించుకున్నాం. స్వాతంత్ర్యం సాధించి వందేళ్లు పూర్తైన 2047 నాటికి దేశం వికసిత్ భారత్ గా తయారవుతుంది. వికసిత్ భారత్ 2047 సాధన సంకల్పానికి స్వర్ణాంధ్ర లక్ష్యం మరింత బలం అందిస్తుంది." అని మోదీ వెల్లడించారు.

**ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం**

"పౌరులకు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలనేది ఎన్డీఏ ప్రభుత్వ నినాదం. ఈజ్ ఆఫ్ లివింగ్ అనే అధ్యాయం దేశంలో ప్రారంభమైంది. ప్రజల జీవితాలను సులభతరం చేసే సంకల్పంతో ఎన్డీఏ పని చేస్తోంది. 12 లక్షల ఆదాయం ఉన్న ప్రతీ ఒక్కరికి పన్ను లేకుండా చేశాం. వృద్ధుల కోసం ఆయుష్మాన్ భారత్ లాంటి సదుపాయాలు కల్పిస్తున్నాం. సరిగ్గా నవరాత్రి ముందు జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి తీసుకువచ్చాం. ప్రజలపై పన్నుల భారం తొలగించాం. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జీఎస్టీ పొదుపు ఉత్సవాన్ని పండుగలా చేసుకున్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరిట కార్యక్రమాలు చేపట్టటం అభినందనీయం. ఈ జీఎస్టీ సంస్కరణల వల్ల రూ.8 వేల కోట్ల మేర ప్రజలకు ఆదా అవటం సంతోషం. కానీ ఆ ప్రయోజనాలు అందరికీ అందాల్సి ఉంది... అప్పుడే అది సఫలమైనట్లు. 21 వ శతాబ్దం భారత దేశానిది, 140 కోట్ల మంది భారతీయులది." అని ప్రధాని చెప్పారు.

**శ్రీశైల దర్శనం ఆనందాన్నిచ్చింది**

"ఢిల్లీ నుంచి నుంచి నేరుగా కర్నూలు ఎయిర్ పోర్టుకు చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సహా... వివిధ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. కర్నూలు ఎయిర్ పోర్టు నుంచి సీఎం, డెప్యూటీ సీఎంలతో కలిసి శ్రీశైల దేవస్థానానికి హెలీ కాప్టరులో వెళ్లారు. దేవస్థానంలో కొలువైన శ్రీశైల భ్రమరాంబిక, మల్లిఖార్జున స్వామి వార్లను ప్రధాని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైల క్షేత్రం విశేషాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రధానికి వేదశీర్వాచనాలిచ్చి... తీర్థ ప్రసాదాలు అందించారు. ఆ తర్వాత ఛత్రపతి శివాజీ ధ్యాన మందిరాన్ని ప్రధాని సహా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సందర్శించారు. అక్కడున్న శిల్పాలను, చిత్రపటాల్లోని విశేషాలను ప్రధానికి నిర్వాహకులు వివరించారు. అనంతరం భ్రమరాంబిక గెస్ట్ హౌసులో ప్రధాని భోజన విరామం తీసుకున్నారు. ఆ తర్వాత హెలీకాప్టర్ ద్వారా కర్నూలులో సూపర్ సేవింగ్స్‌సూపర్ జీఎస్టీ బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకున్నారు. సూపర్ జీఎస్టీసూపర్ సేవింగ్స్ ప్రచారంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన స్కూలు విద్యార్థులు అందించిన చిత్రపటాన్ని ప్రధాని అందుకున్నారు. రాయలసీమ ప్రాంతంలో కొలువైన అహోబిలం నర్సింహస్వామి, మహానందీశ్వరుడు, మంత్రాలయం రాఘవేంద్ర స్వామి ప్రాశస్త్యాన్ని ప్రధాని తన ప్రసంగంలో గుర్తు చేసుకున్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో తొలి జ్యోతిర్లింగం ఉన్న సోమనాథ్ ఆలయం ఉన్న గుజరాత్ లో తాను జన్మించానని.. విశ్వనాధుడి భూమి వారణాసిలో సేవచేసే అవకాశం దక్కిందని అన్నారు. రెండో జ్యోతిర్లింగం శ్రీశైల మల్లిఖార్జున స్వామిదని.. ఇప్పుడు శ్రీశైలం వచ్చి మల్లిఖార్జున స్వామి వారి ఆశీర్వచనాలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఛత్రపతి శివాజీ ధ్యాన మందిరాన్ని కూడా దర్శించానని ఛత్రపతి శివాజీ, అల్లమ్మ ప్రభు, అక్కమహాదేవి లాంటి శివభక్తులకు ప్రణామాలు తెలిపారు. ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి లాంటి ధీరులకు నమస్కారం చేస్తున్నానని ప్రధాని అన్నారు. ఈ సూపర్ జీఎస్టీసూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ, మంత్రి నారా లోకేష్ సహా పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీఎం, మాకు ఎలాంటి విభేదాలు లేవు..

- **మాజీ ఓఎస్డీ సుమంత్ విషయం నాకేమీ తెలియదు**
- **రేవంతన్న సీఎం కావాలని నేను, సురేఖ ఎంతో కష్టపడ్డాము**
- **మీనాక్షి అమ్మ చెప్పినట్లు వింటా**

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :



తెలంగాణ అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ విషయం తనకేమీ తెలియదని ఆమె భర్త, కాంగ్రెస్ నేత కొండా మురళి తెలిపారు. కొండా సురేఖ మంత్రి కార్యాలయానికి తాను ఒక్కసారే వెళ్లాలని, అక్కడ ఏం జరుగుతుందో తనకు తెలియదన్నారు. రేవంతన్న సీఎం కావాలని నేను, సురేఖ ఎంతో కష్టపడ్డామని.. వైఎస్ఆర్ తర్వాత మరో వైఎస్ఆర్ రేవంతన్న అని పేర్కొన్నారు. సీఎం, తమకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని కొండా మురళి స్పష్టం చేశారు. మీడియా ముందు మాట్లాడొద్దని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ చెప్పారని, మీనాక్షి అమ్మ చెప్పినట్లు తాను వింటానని చెప్పుకొచ్చారు.

సిమెంట్ కంపెనీ యాజమాన్యాలను కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ బెదిరించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను బాధ్యతల నుంచి తెలంగాణ ప్రభుత్వం తొలగించింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ ఇంటి వద్దకు సుమంత్ కోసం టాస్క్‌ఫోర్స్ పోలీసులు రావడం, వారిని మంత్రి కుమార్తె సుస్మిత అడ్డుకోవడం జరిగింది. పోలీసులతో సుస్మిత వాగ్వాదం, ప్రశ్నలు అడగడంతో జూబ్లీహిల్స్‌లోని మంత్రి సురేఖ ఇంటి వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో హనుమకొండలో కొండా మురళి మీడియాతో మాట్లాడారు. 'సుమంత్ వ్యవహారంలో ఏం జరుగుతుందో తెలియదు. కొండా సురేఖ మంత్రి కార్యాలయానికి నేను ఒక్కసారే వెళ్లాను. అక్కడ ఏం జరుగుతుందో నాకు తెలియదు. రేవంతన్న సీఎం కావాలని నేను, సురేఖ కష్టపడ్డాము. వైఎస్ఆర్ తర్వాత మరో వైఎస్ఆర్ రేవంతన్న. మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు. ఎవరైనా సృష్టిస్తే మాకు సంబంధం లేదు. ఈ రోజు వరంగల్ తూర్పులో అబ్జర్వర్‌తో ప్రోగ్రామ్ ఉంది. జరుగుతున్న పరిణామాలను తెలుసుకుని స్పందిస్తాను. కొండా సురేఖ హైదరాబాద్‌లో ఉన్నారు, ఈ రోజు వరంగల్ తూర్పులో సమావేశానికి హాజరవుతారు. ఎమ్మెల్సీ ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు, తప్పకుండా ఇస్తారు. కొండా సుస్మితతో ఇప్పుడే మాట్లాడాను. తాను ఇబ్బంది పడ్డాడని చెప్పింది' అని కొండా మురళి చెప్పారు. 'అందరి మంత్రుల ఇండ్లకు వెళ్లి మాట్లాడే సాన్నిహిత్యం నాకు ఉంది. నన్ను టార్గెట్ చేస్తే వాళ్ళకే నష్టం. నేను ఎవరికీ టార్గెట్ కాను, నాకు ఎవరూ టార్గెట్ లేరు. నన్ను తిట్టిన వల్లే మళ్ళీ నా కోసం వస్తున్నారు. నేను మంత్రుల వద్దకు వెళ్తాను, సమస్య సమసిపోయేలా చూస్తాను. మీడియా ముందు మాట్లాడొద్దని మీనాక్షి నటరాజన్ చెప్పారు. మళ్ళీ మీనాక్షి గారిని కలిసి అన్ని విషయాలు మాట్లాడతా. పోలీసులు మంత్రి ఇంటికి ఎందుకు వచ్చారో తెలుసుకుని అడుగులు వేస్తా. మీనాక్షి అమ్మ చెప్పినట్లు వింటాను. పీసీసీ అధ్యక్షులు, సీఎం రేవంత్ అన్నతో మాట్లాడి సమస్య సాల్వ్ అయ్యేలా చేస్తా. ఎవరి తప్పు ఉన్నా, సమస్యకు ఫుల్ స్టాప్ పడేలా చూస్తా' అని కొండా మురళి తెలిపారు.



# జాతీయ, అంతర్జాతీయ క్రీడా ఫెడరేషన్లకు ప్రభుత్వ సహకారం

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

రాష్ట్రంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించేందుకు ముందుకు వచ్చే క్రీడా ఫెడరేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందజేస్తుందని రాష్ట్ర క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. 2026 ఉమెన్స్ హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్ టోర్నమెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించే అవకాశాలు సౌకర్యాలపై పరిశీలన కోసం వచ్చిన హాకీ ఇండియా ప్రతినిధులు గురువారం నివాసంలో కలిశారు. వారిని సన్మానించి,తెలంగాణలో క్రీడలకు ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతను వివరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌లో అంతర్జాతీయ పోటీల నిర్వహణకు తగిన సదుపాయాలు, మౌలిక వసతులు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా అభివృద్ధి పట్ల కట్టుబడి ఉందని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలు జరిగేలా అన్ని విధాల సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

# నవంబర్ 14న కోర్టుకు రండి..

- **హోటల్ కూల్చివేత కేసులో దగ్గుబాటి ఫ్యామిలీకి చిక్కులు**
- **వెంకటేశ్, రానా, సురేశ్ బాబు, అభిరామ్‌పై కేసు నమోదు**
- **నవంబర్ 14న వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం**
- **పర్సనల్ బాండ్ సమర్పించాలని సూచించిన నాంపల్లి కోర్టు**
- **కోర్టు ఆదేశాలను ధిక్కరించారన్న ఆరోపణలపై విచారణ**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ప్రముఖ సినీ నటులు దగ్గుబాటి వెంకటేశ్, రానాలతో పాటు నిర్మాత సురేశ్ బాబు, అభిరామ్‌లకు నాంపల్లి కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఫిల్మ్‌నగర్‌లోని ఓ హోటల్ కూల్చివేతకు సంబంధించిన కేసులో నలుగురూ నవంబర్ 14న కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని స్పష్టం చేసింది. ఆ రోజు కోర్టుకు వచ్చి పర్సనల్ బాండ్ సమర్పించాలని ఆదేశించింది.
వివరాల్లోకి వెళితే, ఫిల్మ్‌నగర్‌లోని దక్కన్ కిచెన్ హోటల్‌ను కోర్టు ఆదేశాలను ధిక్కరించి కూల్చివేశారనే ఆరోపణలపై దగ్గుబాటి వెంకటేశ్, రానా, సురేశ్ బాబు, అభిరామ్‌లపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి గురువారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణ సందర్భంగా న్యాయస్థానం పై విధంగా ఆదేశాలు ఇచ్చింది.
గతంలో ఇచ్చిన కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ ఈ కూల్చివేత జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నమోదైన కేసు విచారణలో భాగంగా దగ్గుబాటి కుటుంబ సభ్యులు కోర్టుకు హాజరు కావడం తప్పనిసరి అని న్యాయస్థానం పేర్కొంది.



# మోదీకి ట్రంప్ అంటే భయం..

**మొదటిపేజీ తరువాయి**




సమయంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేయబోమని మోదీ తనకు హామీ ఇచ్చారని సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఈ ప్రక్రియ వెంటనే పూర్తికాదు. కానీ త్వరలోనే ముగుస్తుంది. వారు తక్కువ సమయంలోనే రష్యా నుంచి చమురు కొనడం ఆపేస్తారు" అని ట్రంప్ విలేకరులతో అన్నారు.
ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఘాటుగా స్పందించారు. "ప్రధాని మోదీకి ట్రంప్ అంటే భయం" అంటూ విమర్శనాస్త్రాలు సంధించారు. "రష్యా నుంచి ఆయిల్ కొనబోమని చెప్పే నిర్ణయాన్ని, ఆ ప్రకటనను కూడా ట్రంప్‌కే వదిలేశారు. ఎన్నిసార్లు అవమానించినా అభినందన సందేశాలు పంపుతూనే ఉన్నారు. ఆర్థిక మంత్రి అమెరికా పర్యటనను కూడా రద్దు చేశారు" అని రాహుల్ ఆరోపించారు.
గత సెప్టెంబర్ నెలలో కూడా భారత్ తన మొత్తం ముడిచమురు దిగుమతుల్లో 34 శాతం రష్యా నుంచే కొనుగోలు చేసింది. భారత్ ఇప్పటికీ రష్యాకు అతిపెద్ద చమురు కొనుగోలుదారుగా కొనసాగుతున్న తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.
మరోవైపు అమెరికా నుంచి సరైన ధరకు లభిస్తే సుమారు 1213 బిలియన్ డాలర్ల విలువైన ముడిచమురు, సహజ వాయువును దిగుమతి చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. ప్రస్తుతం వాషింగ్టన్‌లో ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఈ పరిణామాలు రాజకీయంగా ఆసక్తిని రేపుతున్నాయి.

# బీసీలంటే భయపడే స్థాయికి తెస్తాం..
# మెడికల్ షాపులు తప్ప అన్నీ మూసేయాలి..

**హైదరాబాద్, ప్రజాస్వరం :**

బీసీలంటే అందరికీ చిన్నచూపు, అందుకే బీసీలంటే భయపడే స్థాయికి తెస్తామని బీజీ జేఏసీ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం గాంధీభవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. బీసీలకు కోర్టులు అన్యాయం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 18న తెలంగాణ బంద్‌ను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. బంద్‌లో అందరూ శాంతి యుతంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బంద్‌లో ఒక్క మెడికల్ షాపులు తప్ప అన్నీ మూసేయాలని వ్యాపారులను రిక్వెస్ట్ చేశారు. ఆర్టీసీ బస్సులు సైతం తిరగొద్దు.. ప్రజలు ఆవేశంగా ఉన్నారు.. బస్సులు తిరిగితే తగులపెట్టే ప్రమాదం కూడా ఉందని ఆర్. కృష్ణయ్య అన్నారు. ఇలాంటి బంద్ చరిత్రలో ఎప్పుడు జరగలేదని, భవిష్యత్‌లో కూడా జరగని అన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అలాగే టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఈ నెల 18న జేఏసీ తలపెట్టిన బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. బంద్‌లో కాంగ్రెస్ నాయకులందరూ పాల్గొంటారని వెల్లడించారు.



# బోగస్ ఓట్లపై జోక్యం చేసుకోలేం..

- **జూబ్లీహిల్స్ బోగస్ ఓట్లపై హైకోర్టులో ముగిసిన విచారణ**
- **లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలు చేసిన కేటీఆర్, మాగంటి సునీత**
- **చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం సమాధానం**
- **ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోగస్ ఓట్ల నమోదుపై హైకోర్టులో జరిగిన విచారణ ముగిసింది. ఈ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు విచారణలో బోగస్ ఓట్లపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం (EC) సమాధానం ఇచ్చింది. దీనిపై స్పందించిన హైకోర్టు, ఈసీ ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని, అందువల్ల ప్రత్యేక ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అదే సమయంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత కోర్టు జోక్యం చేసుకోలేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఎన్నికల నిర్వహణపై ఉన్న అధికారాలు పూర్తిగా ఎన్నికల సంఘానికే చెందినవని కోర్టు తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటర్ల




జాబితాలోని బోగస్ ఓట్లపై ఎన్నికల సంఘం స్వతంత్రంగా చర్యలు చేపట్టనుంది.

# నిన్న మల్లోజుల, నేడు ఆశన్న..

- **అడవి బాట వీడి జనజీవన స్రవంతిలోకి మావోయిస్టులు!**
- **'ఆపరేషన్ కగార్' చేపట్టిన కేంద్ర ప్రభుత్వం**
- **భద్రతా దళాల నిరంతర ఎన్‌కౌంటర్‌లు**
- **అడవి నుంచి జనం బాట పడుతున్న మావోయిస్టులు**

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**





కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'తో యాభై ఏళ్ల చరిత్ర ఉన్న మావోయిస్టు పార్టీ కేడర్ కకావికలం అవుతోంది. భద్రతా దళాల నిరంతర ఎన్‌కౌంటర్‌లతో మావోయిస్టు పార్టీ కీలక నేతలు ఒక్కొక్కరుగా లొంగిపోతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఉత్తర బస్తర్ డివిజన్ ఇన్‌ఛార్జి రాజ్ మాన్ లొంగిపోయారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు ఉరఫ్ అభయ్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట సరెండర్ అయ్యారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అగ్రనేత ఆశన్న అలియాస్ తక్కళ్లపల్లి వాసుదేవరావు ఛత్తీస్ గఢ్ కాంకేర్ జిల్లా పోలీసుల ముందు లొంగిపోయారు.
దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు ఆశన్న జనజీవన స్రవంతిలో కలిశారు. ఆశన్నతో పాటు 130 లొంగిపోయారు. తన 130 మంది సహచరులతో కలిసి భైరామ్‌గఢ్ (బీజాపూర్ జిల్లా)లో ఈరోజు సరెండర్ అయ్యారు. మాడ్ డివిజన్ బృందం మొత్తం ఇంద్రావతి నది అవతల నుండి 70కి పైగా ఆయుధాలతో భైరామ్‌గఢ్‌కు చేరుకున్నారు. మావోయిస్టులు శాంతి చర్చల కోసం ఆరు నెలల పాటు ఎదురు చూశారు. మావోయిస్టులు వ్యతిరేక ఆపరేషన్‌ను నిలిపివేయాలని ఆశన్న ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆశన్నతో పాటు 130 మంది మావోయిస్టులను బీజాపూర్ పోలీసులు బస్సులోతరలించారు. నక్సలైట్లందరూ తమ ఆయుధాలను అప్పగించి సరెండర్ అయ్యారు.
తెలంగాణ పోలీసుల ఎదుట మరో మావోయిస్టు నేత బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్ లొంగిపోయారు. సికాస కార్యదర్శిగా కొనసాగిన ప్రభాత్.. తీవ్రమైన అనారోగ్యంతో లొంగిపోయారు. 2027 వరకు మావోయిస్టులను అంతం చేస్తామని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆయుధాలు వదిలపెట్టాల్సిందేనని, లేదంటే ఎవరినీ వదలమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు హెచ్చరించారు. చెప్పినట్టుగానే భద్రతా దళాలు భారీగా కూంబింగ్‌లు నిర్వహిస్తోంది. వరుస పరిణామాల నేపథ్యంలో మావోయిస్టులు ఆయుధాలు వదిలి ఒక్కొక్కరుగా లొంగిపోతున్నారు. అగ్ర నేతలు కూడా సుదీర్ఘ ఉద్యమ ప్రస్థానం ముగించి.. జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నారు.



## మీడియా ముందుకెళ్లొద్దు..

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ మంత్రి కొండా సురేఖతో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్‌లో మాట్లాడారు. మీడియా ముందుకు వెళ్లవద్దని కొండా సురేఖకు ఆమె సూచించారు. కూర్చొని మాట్లాడదామని మీనాక్షి నటరాజన్ చెప్పినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ఆ బాధ్యతల నుంచి ఇటీవల తప్పించిన విషయం తెలిసిందే. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సిమెంటు కంపెనీల యాజమాన్యాలను ఆయన బెదిరించినట్లు ప్రభుత్వం దృష్టికి రావడంతో గట్టిగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్‌లో కొండా సురేఖ ఇంటికి పోలీసులు వెళ్లారు. సురేఖ నివాసంలో ఆమె మాజీ ఓఎస్డీ సుమంత్ ఉన్నారన్న సమాచారంతో మఫ్టీలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మంత్రి కుమార్తె సుస్మిత వారిని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ తమపై బురదజల్లేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలే ఇవన్నీ చేయిస్తున్నారని ఆరోపించారు. తన తల్లిదండ్రులనే లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖతో మీనాక్షి నటరాజన్ మాట్లాడినట్లు తెలిసింది.

# సుప్రీంకోర్టు నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వానికి రఘునందన్ రావు కీలక సలహా

**హైదరాబాద్, ప్రజాస్వరం :**



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవడం దురదృష్టకరం అని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. తొందరపడి సుప్రీంకోర్టులో పిటిషన్ వేసి ఏదో సాధిస్తాం అని చెప్పి ఏమి సాధించలేకపోయిందన్నారు. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించుకోవాలని కోర్టు చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వం ముందు మరో మార్గం లేకుండా పోయిందని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించిన నేపథ్యంలో ఇవాళ ఓ న్యూస్ చానల్‌తో రఘునందన్ రావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లేకంటే ముందే అఖిలపక్షంతో, కేంద్ర ప్రభుత్వంలో చర్చించి ఎస్ఎస్‌పీ వేయాలని ఆలోచిస్తే బాగుండేదన్నారు. బీసీలకు రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు మొదటి నుంచి తడబడుతున్నాయని తప్పటడుగులు పడుతున్నాయని విమర్శించారు. దీని వల్ల బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు.
ఇకనైనా న్యాయనిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం సరైన రీతిలో చర్చించి ముందడుగులు వేయాలని సూచించారు. వెంటనే అఖిల పక్షం ఏర్పాటు చేసి అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుని వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించమనే మీ మొండిపట్టుదల బీసీలకు మరింత అన్యాయం చేస్తుందన్నారు. మీకు నిజంగా నిజాయితీ ఉంటే స్థానిక ఎన్నికల్లో బీసీలకు పార్టీ పరంగా 42 శాతం ఇస్తారా లేక 56 శాతం రిజర్వేషన్లు ఇచ్చి మీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. అప్పుడు బంతి ఇతర పార్టీల కోర్టులోకి వెళ్తుందని అప్పుడు వారు పార్టీ పరంగా ఇస్తారా లేదా అనేది ప్రజలు గమనిస్తారన్నారు. ఇవేవి చేయకుండా కావాలనే లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేశారని తీరా ఎన్నికలు నిర్వహించడానికి ముందు 42 శాతం రిజర్వేషన్లు అంటూ మేమే చాంపియన్లమంటూ ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సర్పంచ్, ఎంపీడీసీల కోసం ఎవరో బీసీ నాయకులు ఆలోచిస్తున్నారని, ఆశపడుతున్నారని తాను అనుకోవడం లేదన్నారు. బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంటే మంత్రివర్గంలో 10 శాతం మంత్రులు బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ వ్యక్తులకు జనాభా దామాషా ప్రకారం మంత్రి పదవులు ఇచ్చి ఆ తర్వాత బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడితే కాంగ్రెస్ పార్టీకి నిజంగానే చిత్తశుద్ధి ఉందని అనుకుంటామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించేప్పుడు అఖిలపక్ష పార్టీలను సంప్రదించి ఇచ్చారా హామీ ఇచ్చేప్పుడు కాంగ్రెస్ ఇచ్చి ఇప్పుడు మమ్మల్ని అనడం ఏంటని ప్రశ్నించారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు కేంద్ర ప్రభుత్వం మోడీ నేతృత్వంలో తప్పకుండా ఇవ్వబోతున్నదన్నారు. కొండా సురేఖ అంశంపై స్పందిస్తూ కాంగ్రెస్ లో బీసీలకు ఏం జరుగుతోందో దేశమంతా చూస్తోందన్నారు.

# బీసీ రిజర్వేషన్లకు బీఆర్ఎస్, బిజెపిలే అడ్డు..



**హైదరాబాద్, ప్రజాస్వరం :**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు కోసం బీసీ జేఏసీ ఈనెల 18న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో నగరంలోని గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ బీసీ సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో కుల సర్వేలకు ఆద్యులు రాహుల్‌గాంధీ అని కొనియాడారు. స్వాతంత్ర్యం అనంతరం శాస్త్రీయంగా కుల సర్వే నిర్వహించి అఫీషియల్ డాక్యుమెంట్ ఇచ్చామని అన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్‌కు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై ఎట్టి పరిస్థితుల్లో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ బీసీ జేఏసీ బంద్‌కు తాము సంపూర్ణ మద్దతును ఇస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ప్రతి బీసీ ఈ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బంద్‌తోనైనా కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని మహేశ్ కుమార్ గౌడ్ కామెంట్ చేశారు.
బీసీ బిల్లు బీజేపీ నేతలు అసెంబ్లీలో మద్దతు ఇచ్చి బయటకు వచ్చి మోకాలడ్డుతున్నాని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. రాహుల్ గాంధీ ఎవరి వాటా వారికి నినాదం.. ఉద్యమంగా మారిందని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో న్యాయ పరంగా పోరాడుతామని తెలిపారు. రాజకీయాలు కేవలం ఎన్నికల వరకేనని.. రిజర్వేషన్ల విషయంలో అందరం ఏకం కావాల్సిన అవశ్యకత ఉందన్నారు. బీసీ రిజర్వేషన్లను రాజ్యంగంలోని 9వ షెడ్యూల్ చేర్చే విషయంలో ప్రధాని మోదీని అడిగేందుకు రాష్ట్రం బీజేపీ నేతలు ఎందుకు జంకుతున్నారని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంతో బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం అన్ని విధాలుగా పోరాడుతామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి తనకు ఉన్న సఖ్యత దేశంలో ఎక్కడా.. ఎవరి మధ్య లేదని అన్నారు. రాహుల్‌గాంధీ ఆశయ సాధన కోసం సీఎం రేవంత్ రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. కాగా, మంత్రి కొండా సురేఖ విషయంపై సీఎంతో మాట్లాడామని మహేశ్ కుమార్ తెలిపారు. సురేఖనే డైరెక్ట్‌గా పిలిచి సీఎం మాట్లాడతానని చెప్పారని పేర్కొన్నారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కారం అవుతాయని మహేశ్ కుమార్ గౌడ్ కామెంట్ చేశారు.



# అభిప్రాయ సేకరణతోనే డీసీసీ ఎన్నిక

- కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ బలోపేతం చేయాలి
- ఏఐసీసీ ఇన్చార్జి సూరజ్ సింగ్ ఠాగూర్

**తాండూరు, అక్టోబర్ 16(ప్రజా స్వరం) :**

కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ బలోపేతం చేయాలి అని ఏఐసీసీ ఇన్చార్జి సూరజ్ సింగ్ ఠాగూర్ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజ్ , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు డిసిసి అధ్యక్షులు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి సూచనల మేరకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలోని వెంకొబ ఫంక్షన్ హాల్ లో యాలాల్, బషీరాబాద్ మండలాల నాయకులతో కాంగ్రెస్ పార్టీ "సంస్థాగత నిర్మాణ జిల్లా స్థాయి సంఘటన్ సృజన్ అభియాన్" సమావేశం నిర్వహించారు.. డిసిసి అధ్యక్ష పదవి కోసం దరఖాస్తులను స్వీకరించారు. తాండూర్ నియోజకవర్గం నుండి ధారాసింగ్, ఉత్తమ్ చంద్, శంకరప్ప డిసిసి అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం బూత్ స్థాయి కార్యకర్తలతో ఇన్చార్జ్ సూరజ్ సింగ్ ఠాగూర్ మాట్లాడి, పార్టీ బలపర్చడంలో ప్రతి కార్యకర్త పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏ ఐ సీ సీ తరఫున ఇన్చార్జ్‌గా సూరజ్ సింగ్ ఠాగూర్ , టీపీసీసీ నుండి బెల్లయ్య నాయక్ , ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రమేష్ మహారాజ్ , ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆస్పత్రిలో ఎమ్మెల్యే బుయ్యని తనిఖీలు

**తాండూరు, అక్టోబర్ 16(ప్రజా స్వరం) :**

తాండూరు పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని గురు వారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించేలా దృష్టిసారించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సూచించారు. ఆసుపత్రి సూపరిండెంట్ డా. వినయ్ కుమార్ తో కలిసి ఆసుపత్రిలోని పలు వార్డులను సందర్శించారు. క్యాసువాలిటి, మెడికల్ వార్డులు, పలు విభాగాలకు చెందిన వార్డులను పరిశీలించారు. మెడికల్ వార్డులలో చికిత్స పొందుతున్న అనారోగ్య బాధితులను పలకరించారు. ఆసుపత్రిలో వైద్యులు చికిత్సలు, వైద్య సేవలు ఎలా అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రికి సంబంధించిన పలు రికార్డులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే పేదలను దృష్టిలో ఉంచుకుని వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సమయ పాలనలో, వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఆసుపత్రిలో ఉన్న ఇబ్బందులు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే వెంట తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి, మాజీ డీపీసీ సభ్యులు పట్లోళ్ల నర్సింలు, మాజీ కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, హబీబ్ లాల, ఆసుపత్రి ఆర్ఎంఓ డా. ఆనంద్ గోపాల్ రెడ్డి, డా. మూర్తి, ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.








# సిపిఆర్‌పై అవగాహన అవసరం

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్


**వికారాబాద్, అక్టోబర్ 16(ప్రజా స్వరం):**

సిపిఆర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిపించుకోవాలని ,ఆకస్మిక గుండెపోటుకు గురైన వ్యక్తులకు సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలను రక్షించవచ్చని, దీనిపై ప్రతి ఒక్కరికీ అవగహన అవసరమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం ఐడిఓసి సమావేశము హాలు నందు జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సిపిఆర్ (కార్డియో పల్మోనరీ రిససిటేషన్) సి పి ఆర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీపీఆర్ పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని,ప్రజల జీవితంలో అకస్మాత్తుగా కొందరికి గుండెపోటు వచ్చి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అలాంటి వారికి సీపీఆర్‌తో ప్రథమ చికిత్స అందజేస్తే ప్రాణా పాయ స్థితి నుండి బయట పడుతారన్నారు. ఓ వ్యక్తికి ఆకస్మిక కార్డియాక్ అరెస్ట్ అయినప్పుడు, వైద్య సహాయం అందేలోపు ఛాతీని 120 సార్లు నొక్కి, 2 శ్వాసలు ఇవ్వడం (120:2 రేషియో) ద్వారా గుండెను సాధారణ స్థితికి తీసుకు రావచ్చని తెలిపారు. కార్డియాక్ హెల్త్ కేర్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు జిల్లాలో ఈనెల 13 నుంచి 17 వరకు వారం రోజులపాటు సిపిఆర్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ విధానంపై గ్రామాలలో మరియు పట్టణాలలో అందరిలోనూ సి పి ఆర్ పై అవగాహన పెంచేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ స్వయంగా చేతులతో సీపీఆర్ విధానాన్ని చేసి చూపించారు. దీని ప్రాధాన్యతను అధికారులకు వివరించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్స్ డాక్టర్ నిఖిల్ ,డాక్టర్ నిరోషా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి ప్రయోగపూర్వకంగా సిపిఆర్ ఎలా చేయాలో క్షుణ్ణంగా వివరించారు. అవగాహన కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్, వైద్యాధికారులు సిపిఆర్ ఆవశ్యకతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ మంగీ లాల్ , జిల్లా వైద్య అధికారి డాక్టర్ పవిత్ర , డిప్యూటీ డిఎంహెచ్ఓ రవీందర్ యాదవ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలి



**వికారాబాద్, అక్టోబర్ 16(ప్రజా స్వరం):**

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 202526 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినీ, విద్యార్థులు, గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 18 వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా వికారాబాద్ తెలంగాణా సాంఘీక సంక్షేమ గురుకుల పాటశాల కొత్త గడి (బాలికల) గురుకుల విద్యాలయంలో దరఖాస్తులు సమమర్పించాలని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు హాల్ టికెట్, ర్యాంకు ధ్రువీకరణ పత్రాలు, ఆదాయం సర్టిఫికెట్ లకు సంబంధించి నకలు ప్రతులు జత పరచాలని సూచించారు.

# హకీంపేట ఆర్టిసి డిపో మేనేజర్‌గా సరితాదేవి బాధ్యతలు స్వీకరణ




**శామీర్ పేట, అక్టోబర్ 17,(ప్రజాస్వరం) :**

హకీంపేట ఆర్టిసి డిపో మేనేజర్ గాసరితా దేవి గురువారం రోజున బాధ్యతలు స్వీకరించారు.గత డిపో మేనేజర్ భవభూతి సిద్దిపేట డిపోకి బదిలీపై వెళ్లారు. సరితా దేవి బాన్సువాడ డిపో నుండి హకీంపేట్ డిపోకి బదిలీపై రావడం జరిగింది. ఆమెకు డిపోనాయకులు విలేజ్ బస్ ఆఫీసర్ గోపు శ్రీనివాస పటేల్, పవన్ కుమార్ యాదవ్ తోటి ఉద్యోగులు స్వాగతం పలికి సన్మానం చేయడం జరిగింది. హకీంపేట్ డిపోకి తొలి మహిళా డిపో మేనేజర్ గా రావడం సంతోషంగా ఉందని, డిపో పరిధిలో ఉన్న అందరి ప్రయాణికుల సూచనలు సలహాలు తీసుకుంటూ డిపోను అగ్రస్థానంలో నిలబెట్టుతానని ఉద్యోగుల సంక్షేమం కూడా చూస్తానని ఆమె తెలపడం జరిగింది. డిపోలో ప్రతిరోజు అన్ని బస్సు సర్వీసులు పూర్తిగా నడపాలని సమయపాలన పాటించాలని ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఉద్యోగస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ సూపర్వైజర్ రామ్మోహన్, శంకర్, చంటి, రాజేందర్, రమేష్, శ్రీశైలం, శ్రీలత, పుష్పలత, తులసి రామ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి రాజీనామా

**వికారాబాద్, అక్టోబర్ 16(ప్రజా స్వరం) :**

వికారాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి స్వయంగా రాజీనామా పత్రాన్ని బీజేపీ అధిష్ఠానికి అందజేశారు. అధికారికంగా బిజెపి అధిష్టానం రాజశేఖర్ రెడ్డి రాజీనామాను ఇంకా ధ్రువీకరించలేదు. ఇటీవల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా జిల్లా బిజెపి అధ్యక్షుడు వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెల్సిందే.





# శామీర్‌పేటలో సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ప్రారంభించిన అధికారులు

**శామీర్‌పేట, అక్టోబర్ 17(ప్రజాస్వరం) :**

శామీర్‌పేటలో సబ్ రిజిస్ట్రార్, వివాహాల అధికారి కార్యాలయాన్ని గురువారం స్టాంపుల అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్, ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, రిజిస్ట్రేషన్,స్టాంపుల శాఖ జాయింట్ ఐటి మధుసూదన్ రెడ్డితో కలిసి రిబ్బిన్ కట్ చేసి కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్య్రక్రమంలో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, శామీర్ పేట తహాసీల్దార్ యాదగిరి రెడ్డి,జిల్లా రిజిస్ట్రారర్ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నాయకుల పరామర్శ



**దౌల్తాబాద్, అక్టోబర్ 16 (ప్రజాస్వరం) :**

మండలంలోని గువ్వలేగి గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి తల్లి మరణించిన విషయం తెలుసుకొని బిజెపి మండల పార్టీ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించారు.కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలన్నారు.మాజీ మండల అధ్యక్షుడు సర్వుగారి భూపాల్ రెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి కురుమ గణేష్,కిసాన్ మోర్చా అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్,బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజు,బూత్ అధ్యక్షులు రవి, వేణు,కొండల్ రెడ్డి,బొల్లం రాజు తదితరులున్నారు.



# దౌల్తాబాద్ యువత ఆదర్శం

- **శ్రమదానం చేసి ప్రయాణ ప్రాంగణం పరిశుభ్రం**

**దౌల్తాబాద్, అక్టోబర్ 16:( ప్రజా స్వరం) :**

ప్రజా సేవ అంటే కేవలం రాజకీయ నాయకులు చేసే పని కాదని,సామాజిక బాధ్యత ప్రతి పౌరుడిపైన ఉందని దౌల్తాబాద్ యువత నిరూపించారు.మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం గత కొంతకాలంగా చెత్త చెదారాలతో నిండిపోయి ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వర్షాల సమయంలో నీటి నిల్వలు,చెత్త దిబ్బలు దుర్వాసనకు కారణమవడంతో పాటు ఆరోగ్య సమస్యలకు దారితీశాయి.ఈ పరిస్థితిని గమనించిన కొంతమంది స్థానిక యువకులు పలుమార్లు గ్రామపంచాయతీ అధికారులను సంప్రదించి శుభ్రపరచాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఎటువంటి చర్యలు లేకపోవడంతో ఎవరికి చెప్పినా ఉపయోగం లేదు మనమే మన ఊరిని పరిశుభ్రంగా ఉంచుదాం అనే సంకల్పంతో ముందుకు వచ్చారు. గురువారం ఉదయం వారు స్వచ్ఛందంగా శ్రమదానం కార్యక్రమం చేపట్టి ప్రయాణ ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రం చేశారు. చెత్త చెదారాన్ని తొలగించి చుట్టుపక్కల ప్రాంతాన్ని కూడా శుభ్రంగా మార్చారు. మణికంఠ, పవన్ కళ్యాణ్,పంజాల స్వామి ,సట్ట స్వామి, బాగోల్ల స్వామి,విరేశ్ మెకానిక్,బాలకృష్ణ,నరేష్, రత్నం పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి మూలం పౌష్టికాహారమే

- **అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి**
- **సిడిపిఓ ఎల్లయ్య**

**దౌల్తాబాద్,అక్టోబర్ 16 ప్రజాస్వరం :**



దుబ్బాక ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ మాసం షెడ్యూల్‌లో భాగంగా గురువారం ఇందుప్రియాల్ అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఎలయ్య మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు ప్రాజెక్టు పరిధిలో పౌష్టికాహారం,జంక్ ఫుడ్ నివారణ,అధిక బరువు నియంత్రణ,అన్నప్రాసన వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానికంగా లభ్యమయ్యే పౌష్టికాహార పదార్థాల వినియోగాన్ని ప్రోత్సహించాలని,గర్భిణీలు బాలింతలు ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా లభించే సేవలను వినియోగించుకోవాలని సూచించారు. పోషణ్ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ శ్యాంసన్, సూపర్వైజర్ గిరిజ పోషకాహారం ప్రాముఖ్యతను చిరుధాన్యాల వినియోగ ప్రయోజనాలను వివరించారు. మెడికల్ ఆఫీసర్ ఆశ్లేష గర్భిణీ, బాలింతలకు వ్యక్తిగత పరిశుభ్రత,ఆరోగ్య సలహాలు అందించారు.కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్స్‌లో భాగంగా పిల్లలకి అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.చివరగా సరైన పోషణ-ఆరోగ్య తెలంగాణ పోషణ లోపం ఏ ఊరిలో కనిపించకూడదు అనే ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, లబ్ధిదారులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.






# ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు

**శామీర్ పేట, అక్టోబర్ 16 (ప్రజాస్వరం) :**

అమ్మవారి పలహారం బండిని ఘనంగా ఊరేగించారు. మండల కేంద్రం శామీర్ పేట శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణంలో భాగంగా బుధవారం బోనాల అనంతరం రాత్రికి అమ్మవారి ఫలహారం బండిని ఊరేగించారు. శామీర్ పేట సబ్ రిజిస్టర్ కార్యాలయం సమీప నుంచి గొర్రె పొట్టేళ్ల వాహనంపై అమ్మవారిని ఏర్పాటు చేసి పలహారం బండిని ఆలయం వరకు ఊరేగించారు. యువకులు ఎంతో ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. మహిళలు, యువతులు ఉత్సాహంతో పాల్గొని నృత్యాలు చేశారు.



# దక్ష జూనియర్ కళాశాలలో ఎక్స్ ప్లోర్ 2 ఏ పుస్తకం ఆవిష్కరణ

**శామీర్ పేట అక్టోబర్ 17(ప్రజాస్వరం) :**

ఆలియాబాద్ దక్ష జూనియర్ జూనియర్ కళాశాలలో దక్ష కళాశాల ప్రిన్సిపల్, డైరెక్టర్ మల్లేష్ వ్రాసిన పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించడం జరిగింది. ఈ పుస్తకం ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని, చాలా సునాయాసంగా ఇంటర్మీడియట్ విద్యార్థులు గణిత శాస్త్రాన్ని అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకం ఉపయోగపడుతుందని దక్ష కళాశాల డైరెక్టర్ శివశంకర్ అభిప్రాయపడ్డారు. ఆయన మాట్లాడుతూ మల్లేష్ ఆయన బృందం చేసిన కృషిని కొనియాడారు. విద్యావేత్తలు నడిపే విద్యాసంస్థలు విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక రకాల నూతన ఆవిష్కరణలను చేసి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాయని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, శివశంకర్ వారి అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



# మంత్రాలను నమ్మి మోసపోవద్దు

- **తొగుట సిఐ లతీఫ్**

**దౌల్తాబాద్ అక్టోబర్ 16 (ప్రజా స్వరం)**






ప్రజలు మూఢనమ్మకాలు మంత్రాలను నమ్మి మోసపోవద్దని శాస్త్రీయ విజ్ఞానంతో ఆలోచించాలి కంప్యూటర్ యుగంలో జ్ఞానంతో మెలగాలని తొగుట సిఐ షేక్ లతీఫ్ అన్నారు. బుధవారం రాత్రి రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ, భయము, మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బ్యాంకు అధికారులమని ఫోన్ చేస్తేనమ్మవద్దు, అకౌంట్ వ్యక్తిగత వివరాలు గుర్తుతెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.గంజాయి ఇతర మత్తుపదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నడి అడిక్షన్ సెంటర్లో చికిత్స మరియు కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పిల్లలు ఏం చేస్తున్నారో కూడా తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని ఎక్కడికి వెళుతున్నారు? ఎవరెవరితో తిరుగుతున్నారు? గమనించాలన్నారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు.సీసీ కెమెరాల ఏర్పాటు గురించి గ్రామ ప్రజలు,వ్యాపారస్తులు,ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు.సీసీ కెమెరాలు 24 గంటలపాటు ప్రజలకు సెన్సాఫ్ సెక్యూరిటీని ఇస్తాయని తెలిపారు.ఆన్లైన్ గేమ్స్ ఆడి మీరు మీ కుటుంబాలను రోడ్డున పడవేయవద్దు. మూఢనమ్మకాలు, చేతబడులు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సామాజిక రుక్మతల గురించి సిద్దిపేట పోలీస్ కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు రామారావు, ఎల్లయ్య, నర్సయ్య, ఎల్లయ్య, శేఖర్ నాటకం పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రాయపోల్ ఎస్ఐ కొంచం మానస, పోలీస్ సిబ్బంది, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**జవహర్ నగర్, అక్టోబర్ 16 (ప్రజాస్వరం):**

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ వార్డులో జ్యోతికాలనీ నివాసం ఉంటున్న కే రంజన్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోగా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సహాయ సహకారాలతో మంజూరైన 51000/ రూపాయల చెక్కును గురువారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిన్నోజు సుధాకర్ చారి లబ్ధిదారుడికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో 13 డివిజన్ బిఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు శోభ, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీలకు సహకరించాలి

- **డిసిపి కోటిరెడ్డి**

**శామీర్‌పేట, అక్టోబర్ 17(ప్రజాస్వరం) :**





వాహనాల తనిఖీలో ప్రతి ఒక్క వాహనదారులు సహకరించాలని డిసిపి కోటిరెడ్డి అన్నారు. శామీర్ పేట్ మండలం తుంకుంట మున్సిపాలిటీ దొంగల మైసమ్మ చౌరస్తా వద్ద సిఐ శ్రీనాథ్ ఆధ్వర్యంలో గురువారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలను డిసిపి కోటిరెడ్డి పర్యవేక్షించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని డీసీపీ కోటిరెడ్డి సూచించారు. వాహనాదారులు సైలెన్స్, ఆర్సీ, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలపై వెల్లేప్పుడు మీరు జాగ్రత్తగా ఉంటేనే మీపై ఆధాపడి ఉన్న మీ కుటుంబ సభ్యులతో పాటు ఎదురుగా వచ్చే వాహనాదారులు కూడా సంతోషంగా ఉంటారని చెప్పారు. కారులో ప్రయాణించే వారు సీజ్ బెల్ట్ తప్పనీసరిగా పెట్టుకోవాలన్నారు. అతివేగం మీతో పాటు మీకు ఎదురుగా వచ్చే వారికి కూడా ప్రమాదమే అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనాథ్, ఎస్ఐలు దశరథ, రమేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రహమత్‌నగర్‌లో జవహర్‌నగర్ బీఆర్ఎస్ నేతల ప్రచారం



**జవహర్ నగర్, అక్టోబర్ 16 (ప్రజాస్వరం) :**


జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా రహమత్ నగర్ లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ మద్దతుగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తో కలిసి జవహర్ నగర్ బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొని ఇంటింట ప్రచారం నిర్వహించారు.ఈ జూబ్లీహిల్స్ నియోజక వర్గం అభివృద్ధి చెందాలన్నా, ప్రతీ ఒక్క పేద వారితో పాటు అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలన్నా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కొండల ముదిరాజ్, నాయకులు రెడ్డి శెట్టి మహేష్, బండి నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత

### త్వరలో అక్రిడిటేషన్ పాలసీ

- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాల నివారణకు ప్రత్యేక చర్యలు**

**హైదరాబాద్ అక్టోబర్ 16 ( ప్రజాస్వరం) :**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జర్నలిస్టుల కోసం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన జర్నలిస్టులకు అందేలా విధి విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, సిపిఆర్వో మల్సూర్ తో కలిసి అక్రిడిటేషన్ పాలసీపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,అర్హులైన జర్నలిస్టుల గౌరవాన్ని కాపాడే విధంగా శాస్త్రీయ పద్ధతిలో అక్రిడిటేషన్ పాలసీ ఉండాలని అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయడానికి ఈనెల చివరినాటికి పాలసీ విధివిధానాలను కొలిక్కితీసుకురావాలన్నారు.

## బీసీల బంద్‌కు వర్తక, వ్యాపారుల మద్దతు



**తాండూరు, అక్టోబర్ 16(ప్రజా స్వరం):**

బీసీ రిజర్వేషన్ల పెంపుకు మద్దతుగా న్యాయపోరాటానికి మద్దతు ఇస్తామని వికారాబాద్ జిల్లా తాండూరు వర్తక, వ్యాపారాల సంఘాలు బీసీ సంఘం నాయకులకు సంఘీభావం ప్రకటించాయి.రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ బీసీ జేఏసీ పిలుపు మేరకు ఈనెల 18న తాండూరు బీసీ బంద్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్ర బీసీ సంఘం నాయకులు కందుకూరి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం తాండూరు ఆర్టీసీ డీఎం సురేష్ కుమార్, ప్రైవేటు విద్యాసంస్థలు, వస్త్ర వ్యాపారులు, ది గ్రైన్ అండ్ సీడ్స్ మర్చంట్స్ అసోసియేషన్, కిరాణా అసోసియేషన్, సినిమా థియేటర్ల యజమాన్యాలను కలిసి బీసీ బంద్ కు మద్దతు ఇవ్వాలని కోరారు. తాండూరు ఆర్టీసీ డీపో మేనేజర్ తో పాటు పలు సంస్థల వారు, వ్యాపార సంఘాలు బీసీ బంద్ కు సంపూర్ణ మద్దతును ప్రకటించారు. బీసీల న్యాయపోరాటంలో తాము భాగస్వాములం అవుతామని అన్నారు. దీంతో బీసీ సంఘం నాయకులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు రాజ్ కుమార్ సోమశేఖర్, బీసీ సంఘం నాయకులు సయ్యద్ షకూర్, టీవీవీ నాయకులు పర్యాద రామకృష్ణ, లక్ష్మణ చారి, శివకుమార్, పరమేష్, విజయలక్ష్మీ, నర్సమ్మ, మంజుల, వివేక్, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమీర్‌పేట వరద కష్టాలకు చెక్... హైడ్రా ప్రత్యేక ఆపరేషన్!

- **అమీర్‌పేట వరద సమస్యకు హైడ్రా పరిష్కారం**
- **పూడుకుపోయిన నాలాలను శుభ్రం చేసే పనుల పరిశీలన**
- **హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయి పర్యటన**
- **ఇప్పటివరకు 45 ట్రక్కుల పూడిక తొలగింపు**
- **నగరమంతా ఇదే విధానం అమలు చేయాలని సూచన**
- **10 సెం.మీ వర్షం కురిసినా తప్పిన ముంపు ముప్పు**

**హైదరాబాద్ అక్టోబర్ 16 ( ప్రజాస్వరం) :**



హైదరాబాద్ నగరంలోని అమీర్‌పేట వాసులకు ఏళ్లుగా వర్షాకాలంలో ఎదురయ్యే వరద కష్టాలకు ఈ ఏడాది తెరపడింది. హైదరాబాద్ రెయిన్‌వాటర్ డ్రైనేజీ అడ్మినిస్ట్రేషన్ (హైడ్రా) చేపట్టిన నాలాల పూడికతీత పనులు సత్ఫలితాలనిచ్చాయి. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం అమీర్‌పేటలో పర్యటించి, జరుగుతున్న పనులను పరిశీలించారు.

జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, మధురానగర్ వంటి ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు అమీర్‌పేట వద్ద నిలిచిపోవడంతో ఏటా ప్రధాన రహదారి నడుం లోతు నీటిలో మునిగిపోయేది. దశాబ్దాలుగా పేరుకుపోయిన చెత్త, మట్టి, పరుపులు, దిండ్లతో ఇక్కడి 6 ప్రధాన పైపులైన్లు పూర్తిగా మూసుకుపోవడమే దీనికి కారణమని అధికారులు గుర్తించారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ విభాగాల సమన్వయంతో ఈ పూడికతీత పనులను చేపట్టారు. ఇప్పటి వరకు 45 ట్రక్కుల పూడికను తొలగించినట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. అమీర్‌పేటలో అనుసరించిన విధానం నగరంలోని అనేక ముంపు ప్రాంతాలకు ఒక నమూనా అని తెలిపారు. ఇదే మాదిరిగా నగర వ్యాప్తంగా కల్వర్టులు, పైపులైన్లలో పూడిక తొలగిస్తే వరద సమస్యను చాలా వరకు అధిగమించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. గాయత్రీ నగర్ ప్రాంతంలో మిగిలిన పైపులైన్ల పనులను కూడా వేగంగా పూర్తి చేసి, వచ్చే వర్షాకాలానికి ముంపు సమస్య పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ప్రస్తుతం 3 పైపులైన్లు అందుబాటులోకి రావడంతో ఈసారి 10 సెంటీమీటర్ల వర్షం పడినా నీరు నిలవలేదని అధికారులు కమిషనర్‌కు వివరించారు. మిగిలిన 3 లైన్ల పనులు కూడా పూర్తయితే 15 సెంటీమీటర్ల వర్షపాతాన్ని కూడా తట్టుకునే సామర్థ్యం వస్తుందని వారు తెలిపారు. హైడ్రా చేపట్టిన పనులపై స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేసి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



## రెడ్ క్రాస్ సొసైటీ నిరాశ్రాయుల వసతి నందు నిరుపేదలకు,వృద్ధులకు, అన్నసమర్పణ

**విశాఖపట్నం,అక్టోబర్ 16(ప్రజాస్వరం):**

విశాఖపట్నం,MVP కోలనీ,అప్పుఘర్ నివాసస్తులు, పద్మశాలి వంశస్తులు,స్వర్గీయ మీసాల అప్పలరాజు(రాజు) వర్ధంతి జ్ఞాపకార్థం,వృద్ధులకు, పేదలకు అన్నదానం,బిస్కట్స్, పండ్లు పంపిణీ,................ సమాజ సేవకుడు.రెడక్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ , పంపాన ఆనంద్, ఆద్వర్యం లో,విశాఖపట్నం, మహారాణిపేట, రెడ్ క్రాస్ సొసైటీ నిరాశ్రాయుల వసతి నందు నిరుపేదలకు,వృద్ధులకు, అన్నసమర్పణ, అందజేయడంమైనది.ఈ కార్యక్రమం లో లేటు మీసాల అప్పలరాజు శ్రీమతి మీసాల సత్య,పెద కుమార్తె వెంకట సాయి, చిన కుమార్తె త్రివేణి,కుటుంబ సభ్యులు చిన్నమ్మలు,పోలరాజు, ఆనంద్,సొసైటీ నిర్వాహకులు రాజేష్,కేర్ టేకర్ ముకుంద్ పాల్గొన్నారు.

# గాలి కాలుష్యాన్ని నివారిద్దాం.


- స్వచ్ఛంధ్రా స్వర్ణాంధ్రను జయప్రదం చేద్దాం
- బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ
- గాలి కాలుష్యాన్ని నివారిదాం అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం కోరారు.

**విశాఖపట్నం,అక్టోబర్ 16(ప్రజాస్వరం):**

ఎంవిపి కాలనీ లోని ఆళ్వార్ దాస్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ అధ్యక్షతన ఎస్ ఆర్ యుజివిఎంసి, ఎపిపిసిబి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ ల నేతృత్వంలో స్వచ్ఛాంధ్రా స్వర్ణాంధ్రా కార్యక్రమంలో భాగంగా మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అప్ హోల్డ్ సంస్థ ప్రతినిధి, ఆక్సిస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ జిల్లా కోఆర్డినేటర్ అయిన జీ. డేవిడ్ రాజు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అన్నారు. నవంబర్ ఒకటి నుంచి వంద రోజులు పాటు బాల్య వివాహాలు చేయవద్దు అని కోరుతూ ప్రచార జాతా నిర్వహించడం జరుగుతుంది అన్నారు.




ఈ కార్యక్రమంలో ఎపిపిసిబి, కోరమాండల్ ఫెర్టిలైజర్స్ వారు అందజేసిన గుడ్డ సంచులు విద్యార్థులకు, అధ్యాపకులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆస్క్ ఫౌండేషన్ ప్రతినిధి మునీర్,ఎస్ సిసిపిసి ప్రతినిధి పేర్ల భాస్కర్,గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ కో ఆర్డినేటర్ జె రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## 18న జరిగే బీసీల బంద్ కు సహకరించండి

- **రాజకీయ పార్టీలకు బీసీ సంఘాల నాయకుల వినతి**

**ఖమ్మం,అక్టోబర్ 16(ప్రజాస్వరం):**

బీసీ కులస్తులకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరిగే బంద్ కు సహకరించాలని కోరుతూ గురువారం బీసీ సంఘాల ప్రతినిధులు పలు రాజకీయ పార్టీల నాయకులను కలిశారు.ఈ సందర్భంగా బీజేపీ,బిఆర్ఎస్, టిడిపి, సిపిఐ, సీపీయం,ఎం ఎల్ పార్టీల నాయకులను కలసిన వారు బంద్ కు సహకరించాలని కోరారు. బీసీల 42శాతం రిజర్వేషన్లపై కోర్టు తీర్పు కు రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమని అన్నారు.బీసీలకు 42% శాతం రిజర్వేషన్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు.ఉభయ సభల్లో ను బిల్లు ఆమోదం పొందాక ఇలా జరగడం అగ్ర వర్ణాల ఆధిపత్యాన్ని చూపుతుందన్నారు. చీకట్లో గొంగడి కప్పుకొని చాటుగా రిజర్వేషన్ ఇవ్వొచ్చా లేదా అని ప్రభుత్వం చూస్తుందాని మండి పడ్డారు.జనాభా దామాషా ప్రకారం హక్కుగా రావాల్సిన రిజర్వేషన్లను అడ్డుకోవాలని హై కోర్టులో,సుప్రీంకోర్టులో కేసు వేశారని ఆరోపించారు. ఏది ఏమైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో 18న జరిగే బంద్ విజయవంతానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు.అనంతరం బిఆర్ ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కురాకుల.నాగభూషణం, బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వర రావు,టీడీపీ నాయకులు కేతినేని హరీష్ చంద్ర,సీపీయం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, సిపిఐ జిల్లాకార్యదర్శి దండి సురేష్,ఎం.ఎల్. పార్టీ రాష్ట్ర నాయకులు పోటు రంగారావు మట్లాడుతూ బంద్ కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.ఈ కార్యక్రమం లో బీసీ సంఘాల నాయకులు ,బొమ్మా రాజేశ్వర రావు,కూరపాటి వెంకటేశ్వర్లు,కత్తి నెహ్రూ, మేకల సుగుణారావు, పెరుగు వెంకట రమణ,స్వర్ణ కుమార్,బిచ్చాల తిరుమలరావు, పెళ్ళూరీ విజయ్ కుమార్,తోడేటి లింగరాజు,శ్రీలక్ష్మీ, నరేందర్, పోట్ల సమ్మయ్య, రాజేశ్వర రావు, సైదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.తొలుత బీసీ సంఘాల నాయకులు స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద గల జ్యోతీ బా పూలే విగ్రహానికి పూలమాల లు వేసి నివాళులు అర్పించారు.



## లైవ్ కోర్టులో ఉన్నామని మర్చిపోయిన లాయర్..

- **షాకింగ్ వీడియో వైరల్**

**ప్రజాస్వరం వైబ్ డెస్క్:**

చట్టాలను రక్షించాల్సిన ఓ న్యాయవాది కోర్టులో వాదనలు జరుగుతుండగానే పాడుపనులు చేస్తూ దొరికిపోయాడు. కెమెరా ఆఫ్ ఉందని అనుకున్నాడో ఏమో గానీ లోకాన్ని మరచి ముద్దుల్లో మునిగిపోయాడు. కట్ చేస్తే అదే లైవ్ లో ఉన్న వ్యక్తి ఎవరో వీడియో రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా ప్రస్తుతం వైరల్‌గా మారింది. అయితే ఈ ఘటన ఎక్కడ జరిగిందో తెలియదు కానీ సోషల్ మీడియాలో మాత్రం తెగ వైరల్ అవుతోంది. శోని కపూర్ అనే వ్యక్తి ఈ వీడియోను ట్విట్టర్ లో షేర్ చేయగా ..ఆన్ లైన్‌లో వాదనలు జరుగుతున్నాయి.. కానీ జడ్జి తాను ఆన్ లైన్‌లో ఉన్నానని మర్చిపోయాడు అంటూ క్యాప్షన్ ఇచ్చాడు. అంతేకాకుండా కెమెరా




ఆఫ్ చేసి ఉందని అనుకున్నాడేమో అంటూ సందేహపడ్డాడు. అయితే వీడియోలో ఉంది మాత్రం లాయర్‌లా కనిపిస్తున్నారు. అతడు కుర్చీలో కూర్చుని ఉండగా అక్కడే నిలబడి ఉన్న ఓ మహిళ వచ్చి ముద్దు పెడుతుంది. లాయర్ కూడా అడ్డు చెప్పకుండా కోపరేట్ చేస్తాడు. ఇక వీడియో వైరల్ అవ్వడంతో ఆ న్యాయవాదిపై నెటిజన్లు ఫైర్ అవుతున్నారు. కోర్టు జరుగుతుండగానే ఇలా చేస్తే ఇంకా కోర్టు లేనప్పుడు మీరు ఎలా ఉంటారని ప్రశ్నిస్తున్నారు.




## ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించిన నాగారం మున్సిపాలిటీ

**నాగారం,అక్టోబర్ 16(ప్రజాస్వరం):**

నాగారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో, కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి పర్యవేక్షణలో గురువారం "అంగీకార్ 2025" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి స్వనిధి, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల యోజన, అవాస్ యోజన 2.0, సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు ప్రజలకు వివరించారు. ప్రజలందరూ ఈ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి సూచించారు, ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ మేనేజర్ నారాయణ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్ కుమార్, రెవెన్యూ ఆఫీసర్ బి. నాగేశ్వర రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయి రాజ్, ఎంవిరాన్మెంటల్ ఇంజనీర్ బి. శ్రవణ్ కుమార్, అన్ని వార్డుల వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది, స్ట్రీట్ వెండర్లు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



## కేజీబీవీ లో ఉచిత వైద్య శిబిరం

**ఖమ్మం,అక్టోబర్ 16 (ప్రజాస్వరం):**

ముదిగొండ మండలంలోని న్యూ లక్ష్మి పురం కేజీబీవీ హాస్టల్ లో ఆరోగ్య వైద్య శిబిరాము. జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి ఆదేశాలతో* ప్రాధమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ అంకం అరుణాదేవి ఆధ్వర్యంలో మండల పరిధిలోని న్యూ లక్ష్మి పురం హాస్టల్ లో గురువారం ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాము నిర్వహించారుహాస్టల్ ఆవరణలో నీరు నిల్వ లేకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాదుల నిర్మూలనకు హాస్టల్ విద్యార్థిని లకు ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. చేతుల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత,కిషోరా బాలికల కు నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగర్తాలు,జ్వరం లు ఎమన్నా వచ్చిన ప్రతి ఒక్కరు పీహెచ్ సి కి రావాలని, వైద్యాధికారి తెలియపరిచారు తదుపరి ప్రతి ఒక్కరికి క్యాన్సర్, టోభాకో, మానసిక ఆరోగ్యం ప్రత్యేకంగా సిపిర్ (CPR) గురించి అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అందె వరకు ముఖ్యమైన అవయవలకు రక్త ప్రసరణ ను కొనసాగించడం లో ఇది కీలక పాత్ర పోసిస్తుంది అని వైద్యాధికారి తెలపడం జరిగింది అనంతరం పలువురికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు ఈ కార్యక్రమంలో సి యచ్ ఓ మధుసూదాణ రావు సూపర్ వైజర్ లత,పద్మావతి ఏ.యన్.మ్.రత్నకుమారి,సంబంధిత ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.





## శ్రీ కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డికి ఆహ్వానం

**వనపర్తి,అక్టోబర్ 16 (ప్రజాస్వరం):**

శ్రీ శ్రీ శ్రీ కురుమూర్తి స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డిని ఆహ్వానించేందుకు స్వామివారి పాలకమండలి ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ క్యాంపు ఇన్‌చార్జ్ బుచ్చన్న కు బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు వి. కమలాకర్, బి. రాజశేఖర్, పి. నాగరాజు పాల్గొన్నారు. వారితో పాటు వనపర్తి కాంగ్రెస్ నాయకుడు మండ్ల దేవన్న నాయుడు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది ప్రసాద్, రమేష్ తదితరులు హాజరయ్యారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని లక్షలాది భక్తులు కురుమూర్తి స్వామి దివ్య దర్శనాన్ని పొందేందుకు విచ్చేస్తారని, పేదల తిరుపతిగా భక్తుల్లో పేరుగాంచిన ఈ ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు హాజరవుతారని అన్నారు.

## ప్రభుత్వం వేసిన లీవ్ పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేయడం బీసీల హక్కులను కాలరాయడమే

- **ఈతాప రాములు**

**వలిగొండ,అక్టోబర్ 16(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకై హైకోర్టులో స్టే విధించగా రాష్ట్ర ప్రభుత్వం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో లీవ్ పిటిషన్ వేయగా సుప్రీంకోర్టు ధర్మాసనం లీవ్ పిటిషన్ కొట్టివేయడం బీసీల హక్కులను కాలరాయడమేనని సీనియర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈతాప రాములు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలో ఒక పత్రిక ప్రకటన విడుదల చేసి అనంతరం మాట్లాడుతూ బీసీలు దేశ జనాభాలో ఎంత శాతం వారికి అంత శాతం హక్కులు రావాల్సి ఉందని, బిజెపి ప్రభుత్వం కావాలనే ద్వంద నీతితో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కాకుండా కుట్రలు పన్నుతుందని ఆయన విమర్శించారు. బీసీల



రిజర్వేషన్ అమలు పై స్టే విధించడం బీసీల మనోభావాలను దెబ్బతీయటమేనని ఆయన విమర్శించారు. భేషరతుగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకై పార్లమెంట్ లో చట్టం తీసుకువచ్చి శాశ్వతంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఘనంగా పోచ రవీందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**వనపర్తి,అక్టోబర్ 16 (ప్రజాస్వరం):**



ప్రముఖ సామాజిక సేవకులు, మానవతా విలువల కు పెద్దపీట వేసే వ్యక్తిగా గుర్తింపు పొందిన పోచా రవీందర్ రెడ్డి జన్మదిన వేడుకలు వనపర్తిలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ఆయనను రిటైర్డ్ ఆర్టీసీ కార్మిక నాయకులు ధర్మా రెడ్డి,రాఘవరెడ్డి, రామచంద్రారెడ్డి, నారాయణ గౌడ్, శ్యామ్ సుందర్ రెడ్డి, సత్యన్నా ఆచారి తదితరులతో కలిసి ప్రత్యేకంగా సన్మానించారు. పట్టణానికి చెందిన పోచా రవీందర్ రెడ్డి అత్యధిక సార్లు రక్తదానం చేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఇప్పటి వరకు అయిదు సార్లు గవర్నర్ల చేతుల మీదుగా సన్మానితులైన ఆయన, వనపర్తి జిల్లాకు మున్సిపల్ స్థాయిలో, జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో పలు అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ, "పోచా రవీందర్ రెడ్డి సేవా కృషి ప్రతి యువతకు ఆదర్శం. సమాజానికి అవసరమైనపుడు ముందుకు వచ్చి సహాయం చేయడం ఆయన నిత్య చర్యగా మారింది," అని ప్రశంసలు కురిపించారు. జన్మదినాన్ని సేవా దినంగా మలచిన రవీందర్ రెడ్డి పట్టణంలోని పలువురు ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తేలిపారు.

MOVIE TIME

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

17.09.2025
శుక్రవారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com






## పెద్ది నుంచి త్వరలో
# లవ్ సాంగ్
### దర్శకుడు బుచ్చిబాబు సానా

రామ్‌చరణ్ హీరోగా జాన్వీ కపూర్ కథానాయికగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది' . ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సిక్సర్ కొట్టి అభిమానుల్లో విపరీతమైన క్రేజ్ పెంచేసింది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఆ క్రేజ్ మరింత రెట్టింపు అయింది. దసరాకు వస్తుందనుకున్న ఫస్ట్ సింగిల్ రాకపోవడంతో ఫ్యాన్స్ కాస్త నిరాశ చెందారు. అయితే దర్శకుడు బుచ్చిబాబు దీపావళికి దద్దరిలే అప్‌డేట్ ఇచ్చారు. తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో తాజా అప్‌డేట్ ఇచ్చారు దర్శకుడు సానా బుచ్చిబాబు. ఆ కార్యక్రమంలో 'పెద్ది' విశేషాలేంటని యాంకర్ ప్రశ్నించగా త్వరలో మంచి లవ్ సాంగ్ ప్రేక్షకుల ముందుకురాబోతుందని. ఆ పాటకు సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్ అదిరిపోయేలా మ్యూజిక్ ఇచ్చారని ఆయన చెప్పారు. ఆ అప్‌డేట్ ఫ్యాన్స్‌లో ఉత్సాహం నింపింది. అయితే ఈ పాట దీపావళికే వస్తుందని ఆడియన్స్ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. దర్శకుడు దానిపై క్లారిటీ ఇవ్వలేదు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. 'ఉప్పెన' బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి.

## సక్సెస్‌కు రవితేజ
# ఎదురుచూపు



మాస్ మహరాజా రవితేజ కు సాలీడ్ హిట్ పడి చాలా కాలమే అయ్యింది. చిరంజీవితో కలిసి రవితేజ నటించిన 'వాల్తేరు వీరయ్య' తర్వాత మళ్ళీ ఆ స్థాయి సక్సెస్ ను రవితేజ చూడలేదు. అయితే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు మాత్రం రవితేజ చేసేస్తున్నాడు. అక్టోబర్ 31న రవితేజ 75వ చిత్రం 'మాస్ జాతర' జనం ముందుకు రాబోతోంది. 'ధమాకా' తర్వాత శ్రీలీల మరోసారి ఈ సినిమాలో రవితేజతో జోడీ కట్టింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పాటలు బాగానే అలరిస్తున్నాయి. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాతో రచయిత భాను భోగవరపు దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇది యాక్షన్ ఎంటర్ టైనర్ జానర్ కు చెందిన సినిమా. ప్రస్తుతం రవితేజ నటిస్తున్న 76వ చిత్రానికి కూడా ఒకప్పటి రచయిత కిశోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నాడు. 'నేను శైలజ, ఉన్నది ఒకటే జిందగీ, రెడ్' వంటి రొమాంటిక్, యాక్షన్ మూవీస్ ను తీసిన అనుభవం కిశోర్ తిరుమలకు ఉంది. పైగా అతనిది మంచి పెన్. రవితేజ సరసన ఈ సినిమా ఆషికా రంగనాథ్, కేతిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ స్పెయిన్ లో జరుగుతోంది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాకు మొదట్లో 'అనార్కలి' అనే టైటిల్ అనుకున్నారు. కానీ ఇప్పుడీ సినిమాకు 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే పేరు పెట్టబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. రాబోయే సంక్రాంతి బరిలో ఈ సినిమా కూడా నిలుస్తుందని అంటున్నారు. ఇది ఫ్యామిలీ డ్రామా. ఇక రవితేజ చేయబోతున్న 77వ చిత్రాన్ని శివ నిర్వాణ డైరెక్ట్ చేయబోతున్నాడని తెలుస్తోంది. 'నిన్నుకోరి, మజిలి, టక్ జగదీశ్, ఖుషీ' సినిమాలను తెరకెక్కించిన శివ నిర్వాణ ఈసారి థ్రిల్లర్ డ్రామాను తీయబోతున్నాడట. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ దీనిని ప్రొడ్యూస్ చేస్తుందని తెలుస్తోంది. ఇందులో రవితేజ తన వయసుకు తగ్గ పాత్ర చేస్తాడని అంటున్నారు. ఇక రవితేజ చేయబోతున్న 78వ సినిమాను కళ్యాణ్ శంకర్ డైరెక్ట్ చేస్తాడని సమాచారం. 'మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' చిత్రాలను డైరెక్ట్ చేసిన కళ్యాణ్ శంకర్ నిజానికి 'టిల్లూ క్యూబ్' కు డైరెక్ట్ చేయాల్సి ఉంది. సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తానని చెప్పారు. అయితే ఇప్పుడు కళ్యాణ్ శంకర్... ఆ సినిమాను పక్కన పెట్టి రవితేజతో ఓ సూపర్ హీరో మూవీ చేస్తాడని సమాచారం. సో... 'మాస్ జాతర' తర్వాత నాగవంశీ... రవితేజతో తీయబోయే సినిమా ఇది. ఇలా... వరుసగా నాలుగు డిఫరెంట్ జానర్స్ తో రవితేజ సినిమాలు చేస్తున్నాడు. మరి ఈ చిత్రాలలో ఏవేవి రవితేజను తిరిగి సక్సెస్ ట్రాక్ లోకి తీసుకొస్తాయో చూడాలి.

## వరుస సినిమాలతో
# అనుపమ దూకుడు



మలయాళ ముద్దుగుమ్మ అనుపమా పరమేశ్వర్ ఒక్కసారిగా తన జోరు పెంచింది. గత రెండు మూడేళ్ళుగా సెట్స్ మీద ఉన్న ఆమె సినిమాలన్నీ వరుస పెట్టి విడుదల కావడం మొదలైంది. దాంతో ఈ యేడాది అనుపమా పరమేశ్వరన్ నటించిన సినిమా మొత్తం ఆరు జనం ముందుకు వచ్చినట్టయ్యింది. విశేషం ఏమంటే ఈ ముద్దుగమ్మ నటించిన నాలుగు చిత్రాలు ఇప్పటికే ఈ యేడాది విడుదల కాగా, గురువారం ఓ మలయాళ చిత్రం, శుక్రవారం తమిళ చిత్రం జనం ముందుకు వస్తున్నాయి. ఈ యేడాది ప్రారంభంలోనే ప్రదీప్ రంగనాథన్ సరసన అనుపమా పరమేశ్వరన్ నటించిన 'డ్రాగన్' మూవీ విడుదలైంది. ఇది తెలుగులోనూ వచ్చింది. ఆ తర్వాత అనుపమా పరమేశ్వరన్ నటించిన మలయాళ చిత్రం 'జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' సినిమా వచ్చింది.అనుపమా ఎంతో ఇష్టంగా చేసిన సినిమా 'పరదా'. తెలుగులో 'సినిమా బండి, శుభం' చిత్రాలను తెరకెక్కించిన ప్రవీణ్ కాండ్రేగుల ఈ సినిమాను రూపొందించాడు. విడుదలకు ముందు ఎంతో బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా ఆ తర్వాత పెద్దంత ప్రభావాన్ని చూపించలేక పోయింది. ఈ సినిమా ప్రమోషన్స్ లో అనుపమా పరమేశ్వరన్ భావోద్వేగానికి గురి కావడంతో అప్పట్లో సోషల్ మీడియాలో ఆమె గురించి విశేష ప్రచారం జరిగింది. ఇక ఈ యేడాది వచ్చిన అనుపమా పరమేశ్వరన్ నాలుగో చిత్రం 'కిష్కింధపురి' . బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో గతంలో 'రాక్షసుడు' మూవీలో నటించిన అనుపమా పరమేశ్వరన్. మరోసారి వీరిద్దరి కాంబోలో వచ్చిన 'కిష్కింధపురి' థియేట్రికల్ గా ఆశించిన స్థాయిలో కలెక్షన్స్ రాబట్టలేకపోయినా... ఓటీటీలో మంచి స్పందనే దీనికి లభించింది. తాజాగా దీపావళి కానుకగా అనుపమా పరమేశ్వరన్ నటించిన 'ది పెట్ డిటెక్టివ్' అనే మలయాళ చిత్రం గురువారం జనం ముందుకు వచ్చింది. నిజానికి ఇది గత యేడాది విడుదల కావాల్సిన సినిమా. రకరకాల కారణాలతో వాయిదా పడి ఎట్టకేలకు విడుదలైంది. ఇక శుక్రవారం ఆమె నటించిన తమిళ చిత్రం 'బైసన్' విడుదల కాబోతోంది. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సీనియర్ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా నటించాడు. కబడ్డీ నేపథ్యంలో ఈ సినిమా రూపుదిద్దుకుంది. 'బైసన్' తెలుగు వర్షన్ ఓ వారం తర్వాత 24న విడుదల కాబోతోంది. గతంలో మారి సెల్వరాజ్ తెరకెక్కించిన 'పరియేరుమ్ పెరుమాళ్'లో తనకు నటించే అవకాశం వచ్చిందని, కానీ అప్పుడు దాన్ని ఉపయోగించుకోలేక పోయానని, ఇప్పుడు మరోసారి ఆయన మూవీ 'బైసన్'లో ఛాన్స్ దక్కడం ఆనందాన్ని కలిగించిందని అనుపమా చెబుతోంది. మరి ఈ రెండు సినిమాల్లో ఏదైనా ఆమెకు మెమొరబుల్ హిట్ ను అందిస్తుందేమో చూడాలి.

## రశ్మిక మైసా
## సంగీత దర్శకుడుగా
# జేక్స్ బిజోయ్




నేషనల్ క్రష్ రశ్మిక మందన నటిస్తున్న పవర్ ఫుల్, ఫీమేల్ సెంట్రిక్ యాక్షన్ మూవీ 'మైసా' ఈ సినిమాతో రవీంద్ర పుల్లె డైరెక్టర్ గా అరంగేట్రం చేస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ భారీ బ్జడెట్‌తో పాన్ `ఇండియా స్థాయిలో 'మైసా' సినిమాను నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మేకర్స్ ఒక ఇంట్రస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. నాని నటించిన 'సరిపోదా శనివారం' చిత్రానికి సంగీతం అందించిన ప్రముఖ సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ ను 'మైసా' చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జేక్స్ బిజోయ్ ట్రైబల్ వాయిద్యాలతో రీరికార్డింగ్ చేస్తున్న వీడియోను రిలీజ్ చేశారు. ఈ సౌండిరగ్ అదిరిపోయింది. 'మైసా' మ్యూజికల్ గా గ్రాండ్ స్కేల్ లో వుండబోతుందని ఈ వీడియో చూస్తే అర్థమౌతోంది. 'మైసా' గోండు తెగల బ్యాక్ డ్రాప్ లో హై `ఆక్టేన్ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా ఉండబోతోంది. రశ్మిక మందణ్ణ ఇంతకుముందు ఎప్పుడూ చూడని ఇంటెన్స్ అవతార్ లో కనిపించనుంది. ఈ సినిమాకు సూర్య 'రెట్రో' సినిమాకి పని చేసిన శ్రేయాస్ పి కృష్ణ డీవోపీగా పని చేస్తున్నారు. యాక్షన్ ని 'కల్కి 2898 ఏ డీ' ఫేమ్ ఆండి లాంగ్ డిజైన్ చేస్తున్నారు.

## వెట్రిమారన్
# తెలుగు సామ్రాజ్యం

- ఎన్టీఆర్ వాయిస్‌తో ప్రోమో విడుదల

తమిళ దర్శకులలో వెట్రిమారన్ ది ఓ ప్రత్యేక శైలి. బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలిచి, వారి సమస్యలను తెరకెక్కించడంలో వెట్రిమారన్ దిట్ట. అంతేకాదు... వేరే దర్శకులతోనూ ఇలాంటి కథలనే సినిమాలుగా నిర్మించిన వ్యక్తి వెట్రిమారన్. తెలుగులోని స్టార్ దర్శకులతో సినిమాలు చేయాలని ఆయన కొంతకాలంగా అనుకుంటున్నారు. కానీ ఏ ప్రాజెక్ట్ కూడా సెట్ కావడం లేదు. ఎన్టీఆర్ తోనూ వెట్రిమారన్ సినిమా చేస్తే బాగుంటుందని భావిస్తున్న అభిమానులు చాలా మందే ఉన్నారు. ఆ మధ్య సూర్య హీరోగా వెట్రిమారన్ ఓ సినిమా చేస్తాడని వార్తలు వచ్చాయి. కానీ ఆ మూవీ అనివార్య కారణాలతో ఆగిపోవడంతో ఇప్పుడు శింబుతో 'అరసన్' మూవీని చేస్తున్నాడు వెట్రిమారన్. ఈ సినిమా తెలుగు వర్షన్ కు ఎన్టీఆర్ సైతం తన గొంతుతో చేయూతనివ్వబోతున్నాడు. శిలంబరసన్, వెట్రిమారన్ కాంబోలో తెరకెక్కుతున్న 'అరసన్'ను తెలుగులో 'సామ్రాజ్యం' పేరుతో డబ్ చేస్తున్నారు. దీని ప్రోమో శుక్రవారం ఉదయం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ తో రాబోతోంది. ఈ మధ్య ఎన్టీఆర్ 'కింగ్ డమ్' మూవీకి వాయిస్ ఓవర్ అందించాడు. ఆ సినిమాను హిందీలో 'సామ్రాజ్య' పేరుతో డబ్ చేశారు. ఇప్పుడు 'అరసన్' మూవీని తెలుగులో 'సామ్రాజ్యం'గా డబ్ చేయడం, దాని ప్రోమోకు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇవ్వడం విశేషం. మొత్తానికి 'సామ్రాజ్యం' అనే టైటిల్ కు ఎన్టీఆర్ కు ఏదో అవినాభావ సంబంధం ఉన్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాను సీనియర్ నిర్మాత థాను ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ కు, హీరో శింబుకు మధ్య కూడా మంచి అనుబంధం ఉంది. బేసికల్ గా మంచి సింగర్ అయిన శింబు తెలుగు సినిమాల్లో కొన్ని పాటలు పాడాడు. అందులో ఎన్టీఆర్ 'బాద్ షా' మూవీ కూడా ఒకటి. ఇటు దర్శకుడు, అటు కథానాయకుడు ఇద్దరితో ఉన్న అనుబంధం కారణంగా 'సామ్రాజ్యం' ప్రోమోకు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చాడని అంటున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999